బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 04 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

# ప్రముఖ నాట్య కళాకారిణి యామిని కృష్ణమూర్తి కన్నుమూత

- ఢిల్లీలోని ఆస్పత్రిలో మృతి
- టీటీడీ ఆస్థాన నర్తకిగా సేవలు..
- ప్రముఖుల సంతాపం



వివరాలు 2వ పేజీలో

# మిగులు ఆహారం ఉన్న దేశంగా భారత్

- ప్రధాని నరేంద్ర మోడీ
- ఐసీఏఇ ప్రారంభోత్సవంలో మోడీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్ ఆహార ధాన్యాల సమృద్ధి దేశంగా మారిందని, ప్రపంచ ఆహార, పోషకాహార భద్రతకు పరిష్కారాలను అందించేందుకు కృషి చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ఆహార ధాన్యాలు, పళ్ళు, కూరగాయలు, పత్తి, చక్కెర, తేయాకు ఉత్పత్తుల్లో భారత్ రెండో స్థానంలో వుందన్నారు. 32వ అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సమావేశాన్ని (ఐసీఏఇ) ప్రధాని మోడీ శనివారం ప్రారంభించారు. 65 ఏళ్ళ తర్వాత భారత్ ఈ సమావేశానికి ఆతిథ్యమిస్తోంది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ కూడా సుస్థిర వ్యవసాయంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందన్నారు. గతంలో భారత్ ఈ సమావేశానికి ఆతిథ్యాన్ని ఇచ్చినప్పటికి భారత్‌కు కొత్తగా స్వాతంత్ర్యం లభించిందని చెప్పారు. దేశ వ్యవసాయ, ఆహార భద్రతకు సవాలుగా నిలిచిన సమయమని అన్నారు. కానీ ఇప్పుడు భారత్ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమృద్ధిని సాధించిందన్నారు. పాలు, పప్పు ధాన్యాలు, మసాలాల ఉత్పత్తులో ప్రపంచంలోనే నెంబర్ వన్ ఉత్పత్తిదారుగా భారత్ వుందన్నారు. దాదాపు 70దేశాల నుండి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. మూడేళ్ళకోసారి జరిగే ఈ సమావేశాలను అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థిక వేత్తల సమాఖ్య ఆగస్టు 2 నుండి 7వరకు నిర్వహిస్తోంది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు

- అక్టోబరు మొదటి వారంలో బ్రహ్మోత్సవాలు



**బలగం టీవి, తిరుమల**

తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల తేదీలను టీటీడీ ఖరారు చేసింది. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని టీటీడీ వెల్లడించింది. అక్టోబరు 4న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహన సేవలు ఉంటాయి. ఎంతో ప్రాముఖ్యత ఉన్న గరుడ సేవ అక్టోబరు 8న నిర్వహించనున్నారు. గరుడ సేవకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్న ఉద్దేశంతో అక్టోబరు 7వ తేదీ రాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు అర్ధరాత్రి వరకు ద్విచక్రవాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల కొండపై అత్యంత రద్దీ నెలకొంటుంది. ఈ నేపథ్యంలో, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, ఎన్నారై, ఆర్జిత సేవల కోటా దర్శనాలను టీటీడీ రద్దు చేయనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు రెండు నెలల సమయమే ఉందని, ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# త్వరలో కొత్త రేషన్ కార్డులు



- రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే రికార్డు
- మధిరలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన
- ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. అర్హత ఉన్నవారందరికీ ఇస్తామని హామీ ఇచ్చారు. శనివారం నాడు ఖమ్మం జిల్లాలో పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు రుణమాఫీతో దేశ చరిత్రలోనే తెలంగాణ రికార్డ్ సృష్టించిందన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అందరికీ మాఫీ చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో రూ.2 లక్షల లోపు రుణమాఫీ కూడా చేస్తామన్నారు. తెలంగాణలో రెప్పపాటు సమయం కూడా కరెంట్ పోకుండా ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గతంలో ట్రిప్ అయితే కరెంట్ ఇచ్చేవాళ్లు కాదని... తమ ప్రభుత్వంలో అర్ధరాత్రి ఫిర్యాదు వచ్చినా వెళ్లి కరెంట్ ఇచ్చేవిధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యం, లైన్ మెయింటెనెన్స్ సమయంలో తప్ప కరెంట్ పోవడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కరెంట్ పోయినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ వాడకం పెరిగినప్పటికీ సమస్య లేకుండా ఇస్తున్నామన్నారు.

తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు ఉపముఖ్య మంత్రి వెల్లడించారు. మధిర నియోజకవర్గంలో కొద్ది రోజుల్లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అంగన్వాడీలో 3వ తరగతి వరకు ఏర్పాటు చేసి, నాలుగో తరగతికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలుకు పంపించే ఏర్పాటుకు నాంది పలికామన్నారు.మధిర నియోజకవర్గంలోని మహిళలను పాడి పరిశ్రమలో వాటాదారులుగా చేసి వారిని పారిశ్రామికవేత్తలుగా చేయడానికి 2014కు ముందే ఇందిరమ్మ డెయిరీని ప్రవేశపెట్టామని తెలిపారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు గేదెలు ఇచ్చి వారిని పరిశ్రమలో వాటాదారులుగా చేస్తామన్నారు. ఆర్థికమంత్రిగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టానని తెలిపారు.

# విదేశాలకు సీఎం రేవంత్ రెడ్డి



ఫైల్ ఫోటో

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. 10 రోజుల పర్యటనలో భాగంగా అమెరికాతో పాటు, దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. అందులో భాగంగానే శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ముఖ్యమంత్రితో పాటు, మంత్రి శ్రీధర్ భాబు.. అధికారుల బృందం అమెరికాకు బయలు దేరి వెళ్లారు.

**రాష్ట్రానికి భారీ పెట్టుబడే లక్ష్యం**

రాష్ట్రానికి భారీ పెట్టుబడే లక్ష్యంగా సీఎం విదేశీ పర్యటన ఉంటుందని ఇది వరకే అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. మొదట హైదరాబాద్ నుంచి న్యూయార్క్ చేరుకుంటారు. అక్కడ ఆరు రోజుల అనంతరం అక్కడి నుంచి నేరుగా దక్షిణ కొరియా వెళ్తారు. అనంతరం అక్కడ పర్యటన ముగించుకొని తిరిగి సీఎం బృందం ఈ నెల 14వ తేదీన ఉదయం హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు. ఈ పర్యాటనలో భాగంగా సీఎం బృందం పారిశ్రామిక దిగ్గజాలతో 52 సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా రూ. 50 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల రంగంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ కంపెనీలతో చర్చలు జరపనున్నారు. వీరిలో ప్రముఖంగా అమెజాన్ వైస్ ప్రెసిడెంట్, కాగ్నిజెంట్ సీఈవో, ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ సీవోవో, పెప్సీ కో సీనియర్ మేనేజ్‌మెంట్, అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన వారు ఉన్నారని తెలిసింది.

ఇక ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితోనూ సీఎం భేటీ కానున్నారు. ఈ నెల6వ తేదీ వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ మీటింగ్ ఉండనుంది. మూసీ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రంలో చేపడుతున్న ఇతర ప్రాజెక్టుల గురించి ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం బృందం వివరించనుంది. ఈ ప్రాజెక్టుల్లో ప్రపంచ బ్యాంకు భాగస్వామ్యం కావాలని, ఆర్థిక సాయం చేయాలని కోరే అవకాశాలు ఉన్నాయి.ఇక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ కూడా సీఎం సందర్శించనున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్యంపైనా అక్కడి డీన్‌తో మాట్లాడనున్నారు. అనంతరం శాన్‌ఫ్రాన్సిస్కోలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జిని సందర్శించనున్నారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టబోయే అంశాలను అక్కడ పరిశీలించనున్నారు. ఇక 10న అమెరికా నుంచి బయలుదేరి 11న దక్షిణ కొరియాకు సీఎం బృందం వెళ్లనుంది. 12న సియోల్‌లో యూయూ పార్క్, కొరియన్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండ్రస్టీ ప్రతినిధులతో సమావేశం కానుంది. 13న హాన్ రివర్ ప్రాజెక్టుపై డిప్యూటీ మేయర్ జూ యంగ్ టాయ్‌తో భేటీ కానుంది.14న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.



# బూతులు తిట్టినా.. అవమానించినా.. ప్రశ్నిస్తూనే ఉంటాం : కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బూతులు తిట్టినా.. అవమానించినా ప్రశ్నిస్తూనే ఉంటాం.. పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్తేంకాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'పోరాటం మాకు కొత్త కాదు. ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని నమ్మించి రాహుల్ గాంధీ తెలంగాణ యువతను మోసం చేస్తున్న విధానం మీద అవసరమైతే ఢిల్లీకి వచ్చి మిమ్మల్ని ఎండగడతం. వదిలిపెట్టం, మీరు బూతులు తిట్టినా, అవమానించినా ప్రశ్నిస్తూనే ఉంటాం, నిలదీస్తూనే ఉంటాం. జై తెలంగాణ.. అంటూ తన అరెస్టుకు సంబంధించిన ఫొటోలను కేటీఆర్ షేర్ చేశారు.

# కేసులతో ప్రజలు విసిగిపోయారు..



- సత్వర పరిష్కారాలు కోరుకుంటున్నారు
- సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ శనివారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోర్టు కేసులతో ప్రజలు విసిగిపోయారని.. సత్వర పరిష్కారాలుకోరుకుంటున్నారని అన్నారు. సుప్రీంకోర్టు 75వ మిగితా 3వ పేజీలో

# తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులు





- ఆ రిజర్వాయర్లకు నీళ్లను విడుదల చేయాలి
- ఉత్తమ్‌కు లేఖ రాసిన హరీష్ రావు

**బలగం టీవి, సిద్దిపేట**

సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్లు పూర్తిగా నీళ్ల లేక రిజర్వాయర్లు అడుగంటి పోయే పరిస్థితికి చేరుకున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. ఈ మేరకు నీళ్ల విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ రాశారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్ల లేక మరోవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటలు వేయాలా వద్దా అనే అయోమయంతో రైతులు ఆవేదన చెందుతున్నారని తెలియజేశారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే జిల్లాల పంటల సాగు విస్తీర్ణం కూడ తగ్గి పోయిందని, కాబట్టి రాజకీయాలు పక్కనబెట్టి మిడ్ మానెర్ నుండి అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం పక్షాన హరీష్ రావు కోరారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో ఆట మొదలైంది

- మంత్రి దామోదర రాజనర్సింహ




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ఇప్పుడే ఆట మొదలైందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని ఆయన పేర్కొన్నారు. జులై 31న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని, ధర్మాసనం తీర్పును అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డికి మాదిగ జాతి ఎప్పుడూ రుణపడి ఉంటుందని మంత్రి తెలిపారు. బేగంపేటలోని ఓ హెూటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై కేవలం తీర్పు రాగానే సంతోషపడకూడదని, దేని ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తారో సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేయాలని మంత్రి రాజనర్సింహ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఈ నెల 16 లేదా 17న మాదిగల సమ్మేళనం పెద్దఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు. మాదిగ జాతి ఎవ్వరికీ వ్యతిరేకం కాదని, అన్ని జాతులతో సమానమని, మాదిగ జాతిని అవమాణిస్తే కండిస్తాం, ఎదురిస్తామన్నారు.

సీనియర్ న్యాయవాదులతో సుప్రీం తీర్పు కాపీలను క్షుణ్నంగా పరిశీలించమని చెప్పనున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీలు ఏబీసీడీ వర్గం కరెక్ట్ కాదన్న సుప్రీంకోర్టు, నేడు సమర్థించిందని మంత్రి గుర్తు చేశారు. మాదిగల్లో మార్పు రావాలని, అందరూ సంస్కారవంతులు కావాలని మంత్రి సూచించారు. ఆర్థిక వ్యవస్థ అనేది ఏ ఒక్క వర్గం చేతిలో ఉండకూడదని, అది అత్యంత ప్రమాదకరమని మంత్రి పేర్కొన్నారు. అ

ప్పట్లో మాదిగ అని చెప్పుకోవడానికి కూడా ఇబ్బంది పడేవారని సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింలు పేర్కొన్నారు. మాదిగలకు ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ తన కంటే చిన్నవాడైనా మాదిగలకు తండ్రి స్థానంలో ఉండి సహాయం చేశాడని, గ్రూప్-1, ఇతర ఉద్యోగాల్లో ఏబీసీడీ అమలు అయ్యేలా చేస్తామని సీఎం చెప్పడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రకు కొత్త నిబంధనలు..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హజ్-2025 కోసం మక్కా యాత్రకు వెళ్లనున్న హజ్ యాత్రికలకు హజ్ కమిటీ కొత్త నిబంధనలు ఖరారు చేసింది. హజ్ యాత్రలో భాగాంగా సౌదీ అరేబియా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను అరబ్బులోని భారత ఎంబేసీ కేంద్ర హజ్ కమిటీకి పంపింది.2025లో జరగనున్న హజ్ వచ్చే సంవత్సరం జూలై చివరి లేదా ఆగస్టు తొలి వారంలో రానున్న క్రమంలో యాత్రికుల పాస్‌పోర్టు విషయమై కీలక మార్పులను చేసింది. హజ్ యాత్రికుల పాస్‌పోర్టులో 2026 జనవరి 31 వరకు గల వాలిడిటీతో పాటు మెషిన్ రీడిబిలిటీ ఉండాలని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అప్జల్ బియాబాని ఖుస్రో పాషా మీడియాకు వెల్లడించారు. ఈ 2024 హజ్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి 11,378 యాత్రికులు మక్కాకు వెళ్లగా, వచ్చే ఏడాది ఈ యాత్రికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తాజాగా సౌదీ ప్రభుత్వం పాస్‌పోర్టు నిబంధనల్లో తీసుకువచ్చిన మార్పులను గర్తించి రాష్ట్రం నుంచి వెళ్లాలనుకున్న వారు తమతమ పాస్‌పోర్టులను అప్‌డేట్ చేసుకోవాలని బియాబాని సూచించారు.

# రాజన్న ఆలయానికి ఏమీ చేయని బీజేపీ ప్రభుత్వం



- మాజీ ఎమ్మెల్యేతోనే వేములవాడ నియోజకవర్గ వెనుకబడిపోయింది.
- ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ,వే ములవాడ**

గత పదేళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు వేములవాడ రాజన్న ఆలయానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలేదు, ఎలా ప్రభుత్వ దిష్టి బొమ్మను బీజేపీ నాయకులు దహనం చేస్తారు అని ప్రశ్నించారు. ప్రజలు ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ప్రస్తుత బడ్జెట్లో విటీడీఏ 50 కోట్లు పెట్టినామని అన్నారు.బీజేపీ ప్రభుత్వం రాజన్న ఆలయానికి చేసింది ఏమీ లేదు అని, దేశ ప్రధాని హెూదాలో నరేంద్రమోడీ వేములవాడకు వచ్చి రాజన్న అభివృద్ధి కోసం ఏ ప్రకటన చేయలేదు అని అన్నారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధి నీ విస్మరించిందని, ఇప్పటికే సిఎం హెూదాలో వీటీడీఏ పై రివ్యూ మీటింగ్ పెట్టాడని,ఏడాది కాకముందే రాజన్న ఆలయ అభివృద్ధి కోసం 50 కోట్లు బడ్జెట్ లో పెట్టామని, బీజేపీ నాయకులు బేషరతుగా మళ్ళీ రాష్ట్ర ప్రభుత్వానికి పాలాభిషేకం చెయ్యాలని డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే సోషల్ మీడియా లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు అని, ఏటా 100 కోట్లు బడ్జెట్ లో పెడుతా అని చెప్పి, కెసిఆర్ మోసం చేశారని అన్నారు.నేను మా మంత్రుల సహకారంతో రాజన్న అభివృద్ధికి 50 కోట్లు పెట్టించానని అన్నారు.బీజేపీ నాయకులు రాజకీయం కోసం మాత్రమే ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసారు అని అన్నారు. రైతంగాన్ని ఆదుకోవాలని ఎల్లంపల్లి రెండవ దశ నిర్మాణం కోసం నిధులు వెచ్చించాము అని, అయినా హంగు ఆర్భాటాలు చేయడం లేదు అని,రంగుల రంగుల బ్రోచర్లు మేము ఏనాడూ విడుదల చేయలేదు అని అన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఫ్రీ బస్సు, ఇప్పటికే చేసామని, ఇవన్నీ చూస్తే ప్రతిపక్షాలకు భయం వేస్తుంది అని అన్నారు. తెల్లవారు జామున వరకు అసెంబ్లీ కోసాగించన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన బతుకమ్మ చీరాల బకాయిలను మా ప్రభుత్వం తీరుస్తుంది అని,ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.బీజేపీ, బిఆర్ఎస్ దిష్టి బొమ్మ దహనం నాటకాలను ప్రజలు గమనించాలని అన్నారు.గత బిఆర్ఎస్ ఎంఎల్ఏ చేతగాని తనంతో వేములవాడ నియోజక వర్గం అభివృద్ధి విషయంలో వెనక బడి పోయింది అని,నేను సేవకుడిగా ఉంటాను, సేవ చేస్తాను అని అన్నారు. ఎస్సి వర్గీకరణ ప్రభుత్వం స్వాగతం స్వాగతిస్తుందని అన్నారు.

# పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలి



- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ధరణిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లతో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను పరిష్కరిచడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రమేష్, రాజేశ్వర్, అన్ని మండలాల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# గోరంటాలలో పులి సంచారం..



**బలగం టీవీ, గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో పులి సంచారం కలకలం రేపుతోంది. పులి తిరుగుతుండడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గోరంటాల గ్రామానికి చెందిన కొమిరిశెట్టి చంద్రం తన పొలం ఆవులను కట్టివేయగా, శుక్రవారం అర్ధరాత్రి పులి ఆవు ల మీద దాడి చేసి చంపేసింది. శనివారం పొలం వద్దకు వెళ్ళిన రైతులు పులి దాడికి గురైన ఆవులను గమనించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పులి పాద ముద్రలను పరిశీలించారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. వీలైనంత తొందరగా పులిని పట్టుకుంటామని అటవీ అధికారులు తెలిపారు.





## అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మోడీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మరోసారి ప్రధాని నరేంద్రమోడీ నిలిచారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ అనే సంస్థ సర్వే నిర్వహించింది. గ్లోబల్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సంస్థ ర్యాంకులను విడుదల చేసింది. జులై 8 నుంచి 14వ తేదీ వరకు సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకులను ఇచ్చారు. ఈ సర్వే ప్రకారం 69 శాతం ఓట్లతో భారత ప్రధాని నరేంద్రమోడీ మొదటి స్థానంలో నిలిచారు. 63 శాతం ఓట్లతో మెక్సికన్ ప్రెసిడెంట్ ఆండ్రెస్ మాన్యుయెల్ లోపేజ్ ఒబ్రేడర్ రెండో స్థానంలో ఉన్నారు. 25 మంది నాయకులతో కూడిన ఈ జాబితాలో జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా చివరి స్థానంలో ఉన్నారు. ఆయనకు 16 శాతం ఓట్లు వచ్చాయి. గతంలో పలు గ్లోబల్ రేటింగ్స్‌లోనూ ప్రధాని మోడీ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 39 శాతం, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 29 శాతం, బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ 45 శాతం, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ 20 శాతం ఓట్లు మాత్రమే సాధించారు.

# స్వగ్రామానికి చేరిన వలస జీవి మృతదేహం






**బలగం టీవీ, గంభీరావుపేట**

ఉన్న ఊళ్లో ఉపాధి లేక, బిడ్డ పెండ్లికి చేసిన అప్పులు తీర్దామని ఆశతో గల్ఫ్ దేశం వెళ్లిన వలస జీవి శవపేటికలో శవమై ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన గెరిగంటి అంజయ్య బిడ్డ పెళ్లికి చేసిన అప్పులు తీర్చడానికి ఆరేండ్ల క్రితం దుబాయి వెళ్ళాడు. తను పనిచేస్తున్న కంపెనీలో సరిగ్గా జీతం ఇవ్వకపోవడం, కొద్ది రోజులకే కంపెనీ మూసివేయడంతో రోడ్డున పడ్డాడు.ఎక్కడ పని దొరకకపోవడం, చేసిన అప్పులను ఎలా తీర్చాలని మానసిక ఆందోళనకు గురై అనారోగ్యం పాలై ఫుట్ పాత్ పై మరణించాడు. కంపెనీ యాజమాన్యం వద్ద పాస్ పోర్టు ఉండిపోవడంతో డెడ్ బాడీని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు అష్టకష్టాలు పడ్డారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించి ఇండియన్ ఎంబసీ లెటర్ పంపించగా, గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి గుండాల్లి నర్సింలు, ఎన్నారై యసరవేణి ఆంజనేయులు చొరవతో డెడ్ బాడీ శనివారం ఇంటికి చేరింది.ప్రభుత్వం గెరిగంటి అంజయ్య కుటుంబం నిరుపేద కుటుంబం అని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ప్రముఖ నాట్య కళాకారిణి యామిని కృష్ణమూర్తి కన్నుమూత

- టీటీడీ ఆస్థాన నర్తకిగా సేవలు..
- ప్రముఖుల సంతాపం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**





ప్రముఖ భరత నాట్య కళాకారిణి యామిని కృష్ణమూర్తి శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్న ఆమె శనివారం సాయంత్రం ఢిల్లీలో కన్నుమూశారు. భరత నాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలైన ఆమె 1968లో పద్మశ్రీ, 1977లో సంగీత నాటక అకాడమీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మ విభూషణ్ అవార్డులు అందుకుని జాతీయ స్థాయిలోనే కాక, ప్రపంచ దేశాల్లోనూ కీర్తి గడించారు.

ఆంధ్ర ప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబర్ 20న నిండుపున్నమినాడు జన్మించారు. తమిళనాడు లోని చిదంబరంలో పెరిగారు. చిదంబరం నటరాజ దేవాల యానికి దగ్గరలోనే వీరి ఇల్లు ఉండేది. ఆ దేవాలయ కుడ్యాలపై ఉన్న శిల్పాల భంగిమలు ఆమెపై చెరగని ముద్రవేశాయి. రోజూ ఆ శిల్పాలను చూసి వచ్చి ఇంటివద్దనే భంగిమలు ప్రదర్శించేవారు. యామిని అసలు పేరు పూర్ణతిలక. తండ్రి యామిని కృష్ణమూర్తి. తండ్రి ప్రోత్సాహం తోనే ఏడవ ఏటనే నాట్యంలో శిక్షణ ప్రారంభించారు.పదేళ్లు వచ్చేసరికి నా ట్యంలో ఆమె నైపుణ్యం సాధించారు. తండ్రి ఆమెను మొదట చెన్నైలోని రుక్మిణీ అరండేళ్ కళాక్షేత్రంలో నాట్యశిక్షణ ఇప్పించారు. ప్రాథమిక నైపుణ్యాల ను నేర్చుకున్న తరువాత ప్రసిద్ధ ఎల్లప్ప పిళ్లై, తంజావూరు కిట్టప్ప పిళ్లై వద్ద నృత్యంలో మరింత శిక్షణ పొందడానికి కాంచీపురం వెళ్లారు. కూచిపూడి నాట్యం కూడా నేర్చుకున్నారు. తరువాత ప్రముఖ ఒడిస్సీ నాట్యాచార్యులు కే లూచరణ్ మహాపాత్ర దగ్గర ఒడిస్సీ నృత్యంలో శిక్షణ పొందారు.

కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం పొందిన యామినీ.. 1957లో తన తొలి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అప్పటి నుంచి దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చి పేరు ప్రఖ్యాతలు పొందారు. భారతప్రభుత్వం యామినీ కృష్ణమూర్తికి పద్మ శ్రీ(1968), పద్మ భూషణ్(2001), పద్మ విభూషణ్(2016) అవార్డులతో సత్కరించింది.

1990లో ఢిల్లీలో యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ అనే పేరుతో స్వయంగా డాన్స్ స్టూడియా నెలకొల్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా కొన్నాళ్లు వ్యవ హరించారు. కూచిపూడికి ప్రతీకగా ప్రతిష్ఠను సాధించారు.



# దేశవ్యాప్తంగా భారీ వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. రహదారులు, నివాస ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలతో రాజధాని నగరం కోల్‌కతాలోని విమానాశ్రయం జలమయంగా మారింది. అక్కడ విమానాలు పార్క్ చేసిన ప్రాంతంలోకి నీళ్లు వచ్చిన దశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పలు విమానాల చక్రాలు పైభాగం వరకు నీట మునిగాయి. కోల్‌కతాతో పాటు హావ్‌డా, సాల్ట్ లేక్, బారక్‌పోర్‌లో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో మోకాళ్లలోతు వరద నీరు చేరింది. దీంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. పురులియా, ముర్షిదాబాద్, మాల్డా, దార్జిలింగ్‌లకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది. గత శుక్రవారం రాజధాని నగరంలో మిశ్రమ వాతావరణ పరిస్థితులు కనిపించాయి. ఒకవైపు 7సెం.మీ. వర్షపాతం.. మరోవైపు 30 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. మరోపక్క విమానాశ్రయంలోకి వరదనీరు రావడంతో రన్‌వే, ట్యాక్సీవేలు నీటిమయంగా మారాయి.

భారీ వర్షాలతో ఉత్తరభారతావని చిగురుటాకులా వణికిపోతోంది. మెరుపు వరదల వల్ల హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక ఊరే కొట్టుకుపోయింది. ఉత్తరాఖండ్‌లో కేదార్‌నాథ్‌కు చేరుకునే మార్గంలో యాత్రికులు చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లో హరిద్వార్, డెహ్రాడున్, టెహ్రీ, రుద్ర ప్రయాగ్, నైనిటాల్‌లలో 16 మంది చనిపోయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో కుండపోత వర్షాల కారణంగా 20 మంది పైగా చనిపోయారని, కాగా గల్లంతైనవారిలో ఇప్పటికీ 53 మంది ఆచూకీ తెలియరాలేదని ప్రభుత్వ ఉన్నతాధికారులు శనివారం మధ్యాహ్నం తెలిపారు. అయితే బంగళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 6 వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది.



# స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం



మనకు
ఎందరో పరిచయమవుతారు
కానీ కొందరు మాత్రమే మంచి స్నేహితులు
అవుతారు. జీవితమనే ప్రయాణంలో ప్రతి ఒక్కరికి
స్నేహితులు ఉంటారు. ఎవరితో చెప్పుకోలేని ఎన్నో
విషయాలను స్నేహితులతో పంచుకుంటాం. స్నేహ
బంధానికి విలువ ఇస్తాం. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలలో
వచ్చే మొదటి ఆదివారం 'అంతర్జాతీయ స్నేహితుల
దినోత్సవం జరుపుకుంటాం. ఈసారి ఆగస్టు 6 అంటే
నేడు 'ఇంటర్నేషనల్ ఫ్రెండ్ షిప్ డే' మీ స్నేహాన్ని
సెలబ్రేట్ చేసుకోండి. హ్యాపీ ఫ్రెండ్ షిప్ డే.

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్నేహాన్ని వర్ణించడానికి మాటలు సరిపోవు. స్నేహం మాటల్లో చెప్పలేని ఒక గొప్ప అనుభూతి. అందుకే స్నేహితుడిని మనసారా హత్తుకుని తనపై ఉన్న ప్రేమను తెలియజేస్తారు. ఎవరు తోడుగా ఉన్నా లేకున్నా.. ఒక్క స్నేహితుడు మాత్రమే జీవితాంతం మనకు అన్ని వేళలా అండగా ఉంటాడు. ఒక మంచి స్నేహితుడు మనకు తోడుగా ఉన్నాడన్నా ఆలోచనే మనల్ని ఎన్ని కష్టాల్నుంచి బటయడేస్తుంది. అందుకే కవులంటారు స్నేహితుడు కొండంత అండ అని . అందుకే అంటారు కదా.. మంచి స్నేహితుడు ఒక్కడున్నా వంద మందితో సమానమని. ఎంతైనా గొప్ప స్నేహితుడిని పొందడానికి కూడా లక్ ఉండాలి.

స్నేహితులకు ఇష్టమైన ఫ్రెండ్ షిప్ డేను ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారు. ఈ రోజు ఎలా మొదలైంది. దీని వెనకున్న చరిత్ర ఏంది అన్న విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

ప్రతి ఏడాది జూలై 30 న అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అంతర్జాతీయ పౌర సంస్థ అయిన %జౌశీతీశ్రీస ఖీతీఱవఅసంష్ట్రఱజూ జతీబయిఱసవ% ద్వారా 1958 లో మొదటిసారిగా ఈ రోజును జరుపుకోవాలని నిర్ణయించారు. స్నేహం ద్వారా శాంతి సంస్కృతిని పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 2011 లో ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశం ఈ రోజును అంతర్జాతీయ స్నేహ దినోత్సవంగా ప్రకటించింది. భారత దేశంతో పాటుగా ప్రపంచంలోని ఇతర దేశాలు ఆగస్టు మొదటి ఆదివారం నాడు ఫ్రెండ్ షిప్ డేను సెలబ్రేట్ చేసుకుంటాయి. ఇక ఈ ఏడాది ఆగస్టు 4(నేడు) తారీఖున ఫ్రెండ్ షిప్ డే ను జరుపుకోనున్నారు.

ఫ్రెండ్ షిప్ డేను హాల్మార్క్ కార్డ్స్ జాయిస్ హాల్ వ్యవస్థాపకుడు 1930 లో ప్రారంభించారు. 1958 లో పరాగ్వేలో అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని జరుపుకున్నారు. స్నేహ బంధాన్ని గౌరవించడానికి ఈ ప్రత్యేకమైన రోజుకు ఏర్పాటు చేశారు. దీని తర్వాత 1988 లో ఐక్యరాజ్య సమితి స్నేహ రాయబారిగా విన్నీ ది పూహ్ ను నియమించింది. 2011 లో ఐక్యరాజ్య సమితి సమావేశంలో జూలై 30 అంతర్జాతీయ స్నేహ దినోత్సవం అని అధికారికంగా గుర్తించబడింది.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియను 3 నెలల్లో పూర్తి చేయాలి



- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి పర్యటనలో ఉన్న రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి శనివారం అక్కడి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కొత్త స్పోర్ట్స్ పాలసీపై సీఎం రేవంత్ నిబంధనలకు లోబడి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ దరఖాస్తుదారుల పరిష్కారం కోసం నాలుగేళ్లుగా వేచిచూస్తున్నట్లు తెలిపారు. వీటి పరిష్కారం కోసం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం వాసులకు తిరుమలలో ప్రత్యేక దర్శనం నిబంధనలను దృష్టిలో ఉంచుకుని భూముల క్రమబదీ కరణలో అక్రమాలకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని.. దళారుల ప్రమేయం లేకుండా సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. కాగా, గత ప్రభుత్వం 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను తీసుకుంది. అప్పట్లో 25.70 లక్షలు రాగా అందులో హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు, జీహెచ్ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6లక్షలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటి పరిధిలో 1.35లక్షలు లెక్కన ఉన్నట్లు తెలుస్తోంది. %క్ష్మఖఅశీఅ ఝతీస రాష్ట్రవఎవ% పై శుభవార్త చెప్పిన %ూా జవీ జష్ఘుఅఞతీఝఎబ చీఝఅఞబ..ఎఉఅవఞఅఞఝ ఎవశ్రీబస్త్రబ% ఈ నేపథ్యంలో మూడు నెలల్లో ఎల్?ఆర్?ఎస్ దరఖాస్తులను పరిశీలించి అర్హమైన వాటిని క్రమబద్ధీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు మొదటి వారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి మార్గదర్శకాలను జారీచేశారు. ప్లాట్?ల అప్లికేషన్లను మూడు దశల్లో, లేఅవుట్ల దరఖాస్తులను నాలుగు దశల్లో పరిశీలించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అనంతరం వాటిలో అర్హమైన వాటిని నిర్ణీత ఫీజులు వసూలు చేసి క్రమబద్ధీకరించడం జరుగుతుంది.

# 'ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్'



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

6 గ్యారంటీలు, 66 హామీలు, 420 రకాల పనులతో అడ్డదారిన అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దెనెక్కాక రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల, కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. హస్తం పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదిన కానుకగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు చేసి, పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. తక్షణమే బేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముచ్చర్ల ఫార్మాసిటీ రద్దు చేస్తామని వాగ్దానం ఇచ్చి, 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఫార్మాసిటీ పైన స్పష్టమైన ప్రకటన ఇవ్వలేదని మండిపడ్డారు. ఫార్మాసిటీ రద్దుచేసి రైతుల భూములను టీఎస్ఐఐసీ ప్రభుత్వ లాగిన్?ల నుంచి విడుదల చేయాలని ఈటల రాజేందర్ కోరారు.

# 15లోపు సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి



- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీతారామ ప్రాజెక్టు పనులు ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం ఇమామ్‌నగర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ ఎస్ఎస్పీ అనుసంధాన కాలువ పనులను పరిశీలించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి సాగర్ ఆయకట్టుకు నీటిని మళ్లించే విధంగా తక్కువ ఖర్చుతో కేవలం రూ. 70 కోట్లతో అనుసంధాన కాలువ నిర్మిస్తున్నామన్నారు.ఈ కాలువ ద్వారా ఖమ్మం జిల్లాలో లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందుతుందని, సాగర్ ఆయకట్టుకు ప్రత్యామ్నాయ నీటి వనరుగా తోడ్పడుతుందన్నారు. ఆగస్టు 15 కల్లా పనులు పూర్తి చేసే విధంగా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయన్నారు. కాగా భూసేకరణ, గుజరాత్ పైప్‌లైన్ అనుమతులు, వర్షాల వల్ల కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఆగస్టు 15 నాటికి మూడు పంప్ హౌస్‌లు పూర్తి చేస్తున్నామని, హెడ్ వర్క్స్ పంప్ హౌస్ పూర్తయిందన్న మంత్రి, కమలాపురం, పూసగూడెం పంప్ హౌస్‌లు సైతం ట్రైల్ రన్ కంప్లీట్ చేసినట్లు వివరించారు.

# 317 జీవోపై సబ్ కమిటీ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కబినెట్ సబ్ కమిటీ 317 జీవోపై సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సమావేశమైంది. కమిటీ సభ్యుడు, మంత్రి శ్రీధర్‌బాబు సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో 317 జీవోపై స్థానికతకు సంబంధించి రెండు రకాల ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖ కేబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదించింది. ఈ అంశాలను సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి తుది నివేదికను సబ్ కమిటీకి సమర్పించాలని ఆదేశించింది. అలాగే, జీవో46కు సంబంధించిన అంశాలపై న్యాయ నిపుణులతో చర్చించింది. సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, రిటైర్డ్ ఐఏఎస్‌లు శివశంకర్, బుసాని వెంకటేశ్వరరావు, సబ్ కమిటీ కన్సల్టెంట్, జాయింట్ సెక్రెటరీ సర్వీసెస్ జి సునీత దేవి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పీజీ డెంటల్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని పీజీ డెంటల్ సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్ ఎండీఎస్-2024లో అర్హత సాధించిన వారు దరఖాస్తుకు అర్హులని పేర్కొంది. ఎండీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఈ నెల 4న ఉదయం 8 గంటల నుంచి 8న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. పూర్తి సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ http://www.knruhs.telangana.gov.in సంప్రదించాలని కోరింది.



# రాహుల్ గాంధీ.. అశోక్ నగర్‌కు వచ్చి యువతను కలవండి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎన్నికల సమయంలో 2లక్షల ఉద్యోగాలని నమ్మించిన రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వచ్చి అశోక్‌నగర్ యువతను కలవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీని ఎలా నెరవేరుస్తారో చెప్పాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీనుద్దేశించి ఎక్స్‌లో ఎనిమిది నెలలు అయినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోవడంతో యువత ఆందోళన చేస్తోందని పేర్కొన్నారు. జాబ్ లెస్ క్యాలెండర్ ఇచ్చారని విమర్శించారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మాటలు నమ్మి తెలంగాణ యువత కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్నారు. ఈ మేరకు నవంబర్ 27,2023న రాహుల్‌గాంధీ ట్వీట్‌ను కూడా ఆయన రీ ట్వీట్ చేశారు.

# ఎక్కడకు రమ్మంటావో చెప్పు



- దానంకు కౌశిక్ రెడ్డి సవాల్

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నడిబొడ్డున తిరుగుతున్నాను ఎక్కడకు రమ్మంటావో చెప్పు అంటూ మాజీ మంత్రి దానం నాగేందర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలు లక్ష్మారెడ్డి, సుధీర్ రెడ్డిలను ఉప్పల్‌లో ఉరికించింది మరిచిపోయావా? అని ప్రశ్నించారు.దానం నాగేందర్‌కు ప్రస్తుత ఎమ్మెల్యే పదవి కెసిఆర్ పెట్టిన భిక్ష అన్నారు. ఆయనకు సిగ్గుంటే తన ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసింది కెసిఆర్ మాత్రమేనన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. కెసిఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు కూడా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లుగా చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగ ఖాళీలతో జాబ్ వివరాలు లేవన్నారు.జాబ్ క్యాలెండర్‌పై ఎవరి సంతకం లేదన్నారు. తేదీలు, ఉద్యోగ ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సీఎం, డిప్యూటీ సీఎం సిగ్గులేకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభలో బిఆర్ఎస్ సభ్యులపై ఇష్టమొచ్చినట్లుగా అసభ్యపదజాలంతో దూషించారని దానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానం నాగేందర్‌కు సిఎం మైక్ ఇప్పించి తమను తిట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో ఆయన సంస్కారం లేకుండా మాట్లాడారన్నారు. నిరుద్యోగుల కోసం తాము కొట్లాడుతుంటే దానం నీచమైన మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. దానం చేసిన విమర్శలన్నీ నిరుద్యోగులను ఉద్దేశించి చేసినవే అన్నారు. ఆయన బెదిరింపులకు భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరన్నారు.

# బీఆర్ఎస్ వాళ్లు చెప్పలేని పదాలతో సభలో దూషించారు



- అందుకే సహనం కోల్పోయా..
- ఎమ్మెల్యే దానం నాగేందర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పరుషపదజాలం ఉపయోగించిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆ అంశంపై మరోసారి స్పందించారు. శాసన సభలో హైదరాబాద్ అభివృద్ధిపై తాను మాట్లాడుతుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పదేపదే ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు బయటకు చెప్పలేని పదాలతో తనను దూషించారని ఆరోపించారు. వారు మాట్లాడింది మైక్‌లో రికార్డ్ కాలేదన్నారు. ముఖ్యమంత్రిని, తనను కించపరిచే విధంగా మాట్లాడటం వల్లే సహనం కోల్పోయి ఆ వ్యాఖ్యలు చేశానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనను కావాలని టార్గెట్ చేశారన్నారు. తాను బీఆర్ఎస్ సభ్యుల పట్ల చేసిన వ్యాఖ్యలు హైదరాబాద్‌లో వాడుక భాషలోనివే అన్నారు. ఆ మాటలు ఎవరికైనా బాధ కలిగిస్తే మాత్రం క్షమాపణ చెబుతున్నానన్నారు.

అధికారం కోల్పోవడం వల్ల బీఆర్ఎస్ నేతలు ఆవేదనతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభ సజావుగా జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గత పదేళ్ల కాలంలో ఏరోజూ తనలాంటి వారికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వారు తమ తీరును మార్చుకోవాలన్నారు.



# దేశంలో పెరుగుతున్న డెంగీ కేసులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో విపరీతంగా పెరుగుతున్న డెంగీ కేసులు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలంటూ దేశంలోని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ముఖ్యంగా, కర్నాటక, కేరళ, తమిళనాడులో డెంగీ కేసులు భారీగా పెరుగుతున్నందున కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి అంతర్-మంత్రిత్వ సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. డెంగీ వ్యాప్తిని నిరోధించటానికి రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. డెంగ్యూ కేసులు అత్యధికంగా నమోదవుతున్న తొమ్మిది రాష్ట్రాలు, 18 మునిసిపాలిటీలతో సమావేశం జరిగింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే భారత్‌లో డెంగీ కేసులు ఈ సంవత్సరం 50 శాతం పెరిగాయి. ఢిల్లీ, కర్నాటక, తమిళనాడు, తెలంగాణలతో సహా తొమ్మిది అధిక ప్రభావిత రాష్ట్రాల్లో డెంగీ పరిస్థితి, సంసిద్ధత స్థితిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అపూర్వ చంద్ర హాట్ స్పాట్‌లను గుర్తించాలనీ, వెక్టర్ నిఘాను పెంచాలనీ, నివారణ చర్యలు చేపట్టడం కోసం డెంగ్యూ కేసుల జియోట్యాగింగ్, ఆస్పత్రి సంసిద్ధతను నిర్ధారించటం వంటి సూచనలు చేశారు. హైబ్రిడ్ మోడ్‌పై సమావేశానికి హాజరైన ఇతర రాష్ట్రాల అధికారులు గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌ల నుంచి ఉన్నారు. అలాగే, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, ముంబయితో సహా 18 మున్సిపల్ కార్పొరేషన్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నాయి. గడచిన నాలుగేళ్లలో కేసులు ఏటా పెరుగుతున్నాయని అపూర్వ చంద్ర ఉద్ఘాటించారు. 2022లో మొత్తం 2.33 లక్షల కేసులు, 303 మరణాలు నమోదయ్యాయి. 2023లో దేశంలో మొత్తం 2.89 లక్షల కేసులు, 485 డెంగీ మరణాలు రిజిస్టరయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా పట్టణ ప్రాంతాలు మొత్తం కేసులలో 55-58 శాతం వాటా కలిగి ఉన్నాయి. అయితే, 2023లో ఇది దాదాపు 68 శాతానికి పెరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, డెంగీ మరణాల రేటు 1996లో 3.3 శాతం నుంచి 2023లో 0.17 శాతానికి తగ్గిందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి తెలిపారు.

# బుల్‌డోజ్ సమావేశాలుగా బడ్జెట్ సమావేశాలు

- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బడ్జెట్ సమావేశాలను బుల్‌డోజ్ సమావేశాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మార్చిందని, మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరు రోజులు రోజుల్లో ఒక్క రోజే ప్రశ్నోత్తరాలకే అవకాశం ఇచ్చారని, జీరో అవర్ ప్రస్తావనే లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. కేవలం రెండు రోజుల్లోనే పద్దులపై చర్చ పూర్తి చేశారన్న ఆయన, బీఆర్ఎస్‌ను తిట్టేందుకు మాత్రమే అసెంబ్లీ సమావేశాలను వినియోగించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు, ప్రతిపక్షాలపై పంజా పాలన అని అన్నారు. సమస్యల గురించి ప్రస్తావిస్తే మైక్ కట్ చేశారని, నిరసన తెలిపితే మార్షల్స్‌తో సభ నుంచి బయటకు పంపించారని ఆయన మండిపడ్డారు. ఏడు నెలల్లోనే రేవంత్ రెడ్డి తన వికృత రూపం బయటపడిందని, ప్రజలకు ఈ దౌర్భాగ్యం కలిగినందుకు తాను బాధ పడుతున్నట్లు తెలిపారు.

శాసనసభ జరుగుతున్న తీరును చూసి కాంగ్రెస్?తో స్నేహంగా ఉంటున్న అక్బరుద్దీన్ ఒవైసీ కూడా తప్పుపట్టారని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సభా నాయకుడిలా కాకుండా ఆటవిక రాజ్యానికి రాజులా వ్యవహరించారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ సభ్యులు మంచిగా మాట్లాడుతున్న సందర్భంలో, రేవంత్ రెడ్డి తప్పుడు పత్రాలు తీసుకొచ్చి సభను పక్కదోవ పట్టించారని ఆరోపించారు. గత ప్రభుత్వంపై ఏడుపు, కేసీఆర్?ను తిట్టడం, కౌరవులలాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉసిగొల్పడం తప్ప ఇంకోటి లేదని పేర్కొన్నారు.

కేసీఆర్ తెలంగాణకు ఏమీ చేయలేదని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో గ్యారంటీల ఊసే లేకుండా పోయిందని, హామీల అమలు, బడ్జెట్‌లో నిధులు లేకుండా పోయాయని అడిగితే సమాధానం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు ప్రచారం చేశారని, సభను తప్పుదోవ పట్టించారన్నారు.

ఎక్కడైనా నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తారా, దీనిపై మేధావులు స్పందించాలని అన్నారు. విద్యుత్ మీటర్ల విషయంలో సీఎం సభను తప్పుదోవ పట్టించారని, ఇంత ఘోరమైన అబద్ధం ఏ ముఖ్యమంత్రి కూడా ఆడరని ఆరోపించారు. అబద్ధాలు ఆడడంలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు ఇవ్వాలని, ప్రపంచంలోనే అతి పెద్ద అబద్ధాలను ఆడటంలో రేవంత్ రెడ్డి పేరును గిన్నిస్ రికార్డులో చేర్చడానికి సిఫారసు చేస్తామన్నారు.

సీతారామ ప్రాజెక్టు కింద రూ. 75 కోట్లతో, 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అంటున్నారని, ఆయనకు కేంద్ర నీటిపారుదలశాఖ మంత్రి ఇవ్వాలని ప్రధాని మోడీకి సూచిస్తున్నట్టు ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అబద్ధాల్లో భట్టి విక్రమార్కకు నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని, చిల్లర వేషాలు వేయడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీని వాడుకున్నారని మండిపడ్డారు.

# బైకును ఢీకొట్టిన కారు.. బాలుడు మృతి



**బలగం టీవీ, హైదరాబాద్**

గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు ఓ బాలుడి ప్రాణాలు తీసింది. డిగ్రీ చదువుతున్న యువకుడు మద్యంమత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసి ఓ ప్రాణాన్ని బలితీసుకోగా మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో ఏడేళ్ల బాలుడు, తల్లిదండ్రులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అయితే అదే సమయంలో సన్ సిటీ నుంచి ఇబ్రహీం బాగ్ వైపు శ్రీనాథ్ అనే యువకుడు తన కారులో వస్తున్నాడు. ఫుల్‌గా మద్యం సేవించిన యువకుడు రాంగ్ రూట్‌లో వెళ్లి అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాలుడు సూర్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి తల్లిదండ్రులకు తీవ్రగాయాలు అయ్యాయి. యువకుడు మద్యం సేవించాడని, కారులో సైతం మద్యం బాటిళ్లు ఉన్నట్లు స్థానికులు చెపుతున్నారు. సమాచారం అందుకున్న గోల్కొండ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో కారులో శ్రీనాథ్ ఒక్కడే ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాధితులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# సోమాలియాలో ఉగ్రదాడి

- 32 మంది మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

సోమాలియాలో హెూటల్‌పై ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డారు. మొగడిషులోని లీడో బీచ్‌లో ఆత్మాహుతి దాడికి పాల్పడడంతో 32 మంది మృతి చెందగా 63 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో పదిమంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. భద్రతా బలగాలు మరో ముగ్గురు తీవ్రవాదులను కాల్చి చంపాగా ఒకరిని పట్టుకున్నారు. ఎక్కువ మంది గుంపుగా ఉన్నచోట ఆత్మాహుతి దాడికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. దాడికి తామే బాధ్యులమని అల్‌ఖైదా అనుబంధం సంస్థ ప్రకటన చేసింది. గత సంవత్సరంలో ఇదే బీచ్ లో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో తొమ్మిది మంది చనిపోయిన విషయం తెలిసిందే.

# విజయంపై భారత్ కన్ను..




- నేడు భారత్, శ్రీలంక రెండో వన్డే
- మ్యాచ్‌కు వర్షం ముప్పు

**బలగం టీవీ, కొలంబో**

శ్రీలంకతో తొలి వన్డేలో మ్యాచ్‌ను టై చేసుకున్న భారత జట్టు రెండో వన్డేలో విజయంపై కన్నేసింది. అయితే ఆదివారం టీమిండియా, లంక మధ్య జరుగబోయే రెండో వన్డేకు వాన ముప్పు పొంచి ఉంది. ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్ ఆరంభానికి ముందే వర్షం పడనుందని అక్కడి వాతావరణ శాఖ తెలిపింది.

ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వాన కురిసే అవకాశం 38 శాతం ఉందని, అదే సాయంత్రం పూట చినుకులు పడేందుకు 41 శాతం నుంచి 63 శాతం అవకాశం ఉందని సమాచారం. అయితే కొలంబో మైదానంలో మంచి డ్రైనేజీ సిస్టమ్ ఉండటం కలిసొచ్చే అంశం. కానీ వర్షం ఆగితేనే ఆటకు మైదానం సిద్ధం చేయగలరు. వర్షం అంతరాయం కలిగిస్తే కొన్ని ఓవర్లను కుదించి ఆడిస్తారు. ఆటకు సాధ్యం కాకపోతే మాత్రం రద్దు చేస్తారు. అప్పుడు బుధవారం జరిగే చివరి మ్యాచ్ సిరీస్ డిసైడర్‌గా మారుతోంది.ఒకవేళ వాన కారణంగా రెండో వన్డే రద్దయితే మూడో మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. సిరీస్ విజేత దాంతో, సిరీస్ గెలిచేదెవరో అని అభిమానుల్లో ఆసక్తి మొదలైంది.

తొలి వన్డేలో దిగిన జట్టునే భారత్ దాదాపుగా రిపీట్ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే ప్లేయింగ్ ఎలెవన్‌లో ఒకట్రెండు మార్పులు మాత్రం తథ్యంగా కనిపిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మకు జతగా మరో ఓపెనర్‌గా శుబ్‌మన్ గిల్ బరిలోకి దిగుతాడు. ఫస్ట్ వన్డేలో అతడు 16 పరుగులు మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. అయినా వైస్ కెప్టెన్ కాబట్టి గిల్‌ను పక్కనబెట్టలేని పరిస్థితి. ఓపెనర్లుగా రోహిత్–గిల్ వస్తే.. ఫస్ట్ డౌన్‌లో కింగ్ విరాట్ కోహ్లీ దిగుతాడు. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ ఆడటం ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ టీమ్‌లో ఉండటం పక్కా అనే చెప్పాలి. అయితే రెండో వన్డేలో శివమ్ దూబేకు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కడం డౌట్‌గా ఉంది. అతడి స్థానంలో రియాన్ పరాగ్‌ను రీప్లేస్ చేసే ఛాన్స్ బలంగా కనిపిస్తోంది.


తొలి వన్డేలో దూబె బాగానే ఆడినా మ్యాచ్‌ను ఫినిష్ చేయలేకపోయాడు. బౌలింగ్‌లో ఒక వికెట్ తీసినా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. పైగా సుందర్, అక్షర్ రూపంలో ఇద్దరు లెఫ్టాండ్ బ్యాటర్లు టీమ్‌లో ఉన్నారు. అందుకే దూబేకు బదులు లాంగ్ ఇన్నింగ్స్ ఆడే సత్తా, క్వాలిటీ స్పిన్ బౌలింగ్ వేసే టాలెంట్ ఉన్న పరాగ్‌ను జట్టులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇక రెండో వన్డేలో స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ ఆడటం ఖాయం. అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ మరోమారు పేస్ బాధ్యతల్ని పంచుకుంటారు.

**జట్లు(అంచనా)..**

ఇండియా: రోహిత్(కెప్టెన్), గిల్, కోహ్లీ, రాహుల్, పంత్(వికెట్ కీపర్), దూబే/పరాగ్, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ఆర్షదీప్, సుందర్.

శ్రీలంక: అసలంక(కెప్టెన్), నిస్సంక, ఫెర్నాండో, కుశాల్ మెండీస్(వికెట్ కీపర్), సమరవిక్రమ, లైనగే, వెల్లలిగే, హసరంగ, తీక్షణ, అసితా, కరుణరత్నే/ధనుంజయ.

# మనూ బాకర్‌కు చేజారిన పతకం



## • 25మీ పిస్తోల్ ఈవెంట్‌లో నాలుగో స్థానం

**బలగం టీవీ, పారిస్**

షూటర్ మనూ భాకర్.. పారిక్ ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ మెడల్స్ కొట్టే చాన్స్ చేజార్చుకుంది. శనివారం జరిగిన 25మీటర్ల పిస్తోల్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని అందుకునే చాన్స్ పోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్, మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ ఈవెంట్లలో మనూ బాకర్ కాంస్య పతకాలు సాధించింది. శనివారం జరిగిన 25 మీటర్ల పిస్తోల్ ఈవెంట్ ఫైనల్‌లో మనూ పతకం కోసం తీవ్ర ప్రయత్నం చేసింది. మనూ, హంగేరియన్ షూటర్ మధ్య ఎలిమినేషన్ రౌండ్ జరిగింది.5 షాట్ టార్గెట్‌లో మనూ కేవలం మూడింటిని షూట్ చేసింది. అయితే.. ఎలిమినేషన్ రౌండ్‌లో హంగేరికి చెందిన షూటర్ వెరోనికా మేజర్ 4 హిట్స్ కొట్టింది. 33 పాయింట్లతో కొరియా క్రీడాకారిణి జిన్ యాంగ్ తొలి స్థానంలో ఉండగా, ఫ్రాన్స్ షూటర్ కామిల్లీ జెడ్‌జివిస్కీ రెండో స్థానంలో, వెరోనికా మూడో స్థానంలో నిలిచారు.



## క్వార్టర్స్‌లో దీపిక ఓటమి

**బలగం టీవీ, పారిస్**

భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి పారిస్ ఒలింపిక్స్–2024లో క్వార్టర్ ఫైనల్‌లో ఓడింది. విశ్వ క్రీడల్లో రెండో సారి క్వార్టర్ ఫైనల్ చేరిన దీపిక సెమీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. శనివారం దక్షిణ కొరియా ఆర్చర్ సు హైయన్‌చేతిలో 4–6తో ఓటమి పాలైంది. దాంతో, ఆమెపై ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన దీపిక శుక్రవారం క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టి పతకంపై ఆశలు రేపింది. దాంతో, కనీసం కాంస్యంతో ఆమె చరిత్ర సృష్టించడం ఖాయమనుకున్నారంతా. కానీ, సెమీస్‌లో దీపిక అనూహ్యంగా తడబడింది. దక్షిణ కొరియా ఆర్చర్‌ను తొలి సెట్‌లో 28–26తో వెనక్కి నెట్టిన భారత ఆర్చర్.. రెండో సెట్‌ను 25–28తో కోల్పోయింది. కీలకమైన మూడో సెట్‌లో 29–28తో దీపిక విజయం సాధించినా ఆఖరి సెట్‌లో 10, 7, 10 పాయింట్లు సాధించింది. దాంతో,

## ఫైనల్లో అల్కారజ్





**బలగం టీవీ, పారిస్**

ఒలింపిక్స్ టెన్నిస్‌లో ఫైనల్ చేరిన అతి పిన్న వయస్కుడిగా 21 ఏళ్ల స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కారజ్ చరిత్ర సృష్టించాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిళ్లు నెగ్గి ఊపుమీదున్న అల్కారజ్ విశ్వక్రీడల్లో పసిడి అందుకునేందుకు అడుగుదూరంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన ఏకపక్ష సింగిల్స్ సెమీస్ పోరులో 6–1, 6–1తో ఫెలిక్స్ అగర్ అలియాస్సిమ్ (కెనడా)ను చిత్తుగా ఓడించి, స్వర్ణానికి అడుగు దూరంలో నిలిచాడు. ఆదివారం జరిగే ఫైనల్లో టాప్ సీడ్.. సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

## 'గోట్' థర్డ్ సింగిల్ రిలీజ్..

**బలగం టీవీ, సినిమా బ్యూరో**

వెంకట్ ప్రభు దర్శకత్వంలో దళపతి విజయ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి యువన్ శంకర్ రాజా మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కాగా, తాజాగా ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ విడుదల చేశారు మేకర్స్. ఇక దళపతి 68 గా వస్తోన్న ఈ మూవీ సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీలో ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు మిక్ మోహన్, జయరాం, అరవింద్ ఆకాశ్, ప్రేమ్ గీ అమరేన్ తదితరులున్నారు.

# జీ2 నుంచి ఆరు స్టిల్స్ విడుదల

**బలగం టీవీ, సినిమా బ్యూరో**

అడవి శేష్ నటించిన 'గూఢచారి' ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో మనందరికి తెలిసిందే. చిన్న సినిమాగా వచ్చి.. పాన్ ఇండియా రేంజ్ లో భారీ కలెక్షన్లు కొల్లగొట్టింది. ఇక ఇప్పుడు దానికి కొనసాగింపుగా 'జీ2' తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సీక్వెల్ కు విజయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ మూవీ నుంచి ఆరు క్రేజీ స్టిల్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'గూఢచారి' మూవీ ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ ఈ స్టిల్స్ ను వదిలారు. దాదాపు ప్రతి స్టిల్ లో గన్ ఉండటం విశేషం.

ఇదిలా ఉండగా.. తొలి భాగం మొత్తం ఇండియాలో జరగ్గా.. జీ2 ఇంటర్నేషనల్ బ్యాక్ డ్రాప్ లో జరగనుంది. పార్ట్ 1లో కనిపించిన పాత్రలతో పాటుగా మరికొన్ని పాత్రలు కనిపించబోతున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రస్తుతం షఉటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక జీ2ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తగా నిర్మిస్తున్నాయి. మరి జీ2 నుంచి రిలీజ్ అయిన ఆరు స్టిల్స్ ఎలా ఉన్నాయి? మీ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేయండి.








## '35' ఫ్రెండ్ షిప్ డే కానుక

**బలగం టీవీ, సినిమా బ్యూరో**

నివేదా థామస్ నటిస్తున్న తాజా చిత్రం '35'–చిన్న కథ కాదు' ఈ సినిమాను రానా దగ్గుబాటి ప్రొడ్యూస్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫ్రెండ్ షిప్ యాంథెమ్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఫ్రెండ్ షిప్ డే కానుకగా ఈ సాంగ్‌ను ఆదివారం రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విశ్వ, ప్రియదర్శి తదితరులు ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. నంద కిషోర్ ఈమని ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదల కానుంది.